క్లుప్తంగా

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మర్రి



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ముచ్చర్లలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం ఏర్పాటుకు భూమి పూజ కార్యక్రమానికి విచ్చేసిన రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల నిరంజన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

మెదడువాపు నివారణకు టీకా తప్పనిసరి


పిల్లలకు వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

తుర్కయంజాల్: మెదడు వాపు నివారణకు జేఈ వ్యాక్సిన్ తప్పనిసరి అని పురపాలక సంఘం పరిధి కమ్మగూడ కౌన్సిలర్ నారని కవిత, మండల విద్యాధికారి కె. వెంకట్ రెడ్డి అన్నారు. గురువారం కమ్మగూడలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన వ్యాక్సినేషన్ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై పిల్లలకు జేఈ వ్యాక్సిన్ వేశారు. అదేవిధంగా దోమలు వ్యాప్తి చెందకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మస్కు జంగయ్య, డాక్టర్ శృతి, ఆశ కార్యకర్త రాణి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


వేడుకలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కడ్తాల్: ఇంటర్‌లో కలిసి చదువుకున్న మిత్రులందరూ దాదాపు 16 ఏళ్ల తర్వాత ఒక చోటుకు చేరుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. దీనికి మండలంలోని మైసిగండి గ్రామంలో ఓ కన్వెన్షన్ హాల్ వేదికైంది. గురువారం నగరంలోని ఓ జూనియర్ కళాశాలకు చెందిన 2008–2010 సంవత్సరం పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు అడిగి యోగ క్షేమాలు, కుటుంబ వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆట పాటలతో హుషారుగా గడిపారు. కార్యక్రమంలో ఫణీంద్రగౌడ్, శ్రీను, అశోక్, గోవర్ధన్, మోహన్, పవన్, నాను, కల్పన, బాలమణి, స్వప్న, పద్మ, రాజేశ్, గణేశ్, అనిల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చీడ పీడల నివారణకు సస్యరక్షణ చర్యలు


శెట్టిపల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ అరుణకుమారి

ఆమనగల్లు: పంటలో చీడపీడల నివారణకు రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఆమనగల్లు మండల వ్యవసాయాధికారి అరుణకుమారి కోరారు. మండలంలోని శెట్టిపల్లి, చెన్నంపల్లి, జంగారెడ్డిపల్లి గ్రామాలలో రైతులు సాగుచేసిన పంటలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పలుచోట్ల పత్తిపంటలో రసం పీల్చే పురుగుల బెడద ఉన్నట్లు రైతులు తెలిపారన్నారు. రసం పీల్చే పురుగుల నివారణకు ఇమిడాక్లోఫ్రైడ్ 1 గ్రాము, ఏసిఫెట్ 2 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మొక్కలు ఎర్రబారి పోకుండా ఉండటానికి స్పాంటా 1 కిలో, కాపర్ ఆక్సిక్లోరైడ్ 500 గ్రాములు కలిపి మొక్క మొదట్లో పోయాలన్నారు. కార్యక్రమంలో రైతులు పర్వతాలు, వీరయ్య, జంగయ్య, సంతోష తదితరులు ఉన్నారు.

పరామర్శ

మంచాల: నాయీ బ్రహ్మణ సంఘం జిల్లా నాయకుడు ఆశ్వల మారయ్య మరణం తీరని లోటని మంచాల పీఏసీఎస్ చైర్మన్ వెదెరె హన్మంత్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఆరుట్ల గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన మారయ్య మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నేతలు జ్ఞానేశ్వర్, వెంకటేశ్, పాండుగౌడ్, రమణారెడ్డి, జంగయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేతల ముందస్తు అరెస్టు

సీఎం పర్యటన సందర్భంగా పోలీసులకు ఆదేశాలు


ఇబ్రహీంపట్నం: అరెస్టయిన బీఆర్ఎస్, సీఐటీయూ నేతలు

ఇబ్రహీంపట్నం: మీర్‌ఖాన్‌పేటలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ భూమి పూజకు గురువారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్న సందర్భంగా సీపీఎం, బీఆర్ఎస్ నేతలను ముందస్తుగా ఇబ్రహీంపట్నం పోలీసులు అరెస్టు చేశారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి.రాజ్‌కుమార్, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షులు మడుపు శివసాయి, సీఐటీయూ జిల్లా నాయకులు బుగ్గరాములు, పోచమోని కృష్ణలు అరెస్టయిన వారిలో ఉన్నారు. అనంతరం మంచాల పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

అరెస్టులకు భయపడం

అరెస్టులు భయపడేదిలేదని బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్ అన్నారు. ప్రజాపాలన అంటే అక్రమ అరెస్టులేనా అని ప్రశ్నించారు. ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తిరిగి ఇస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

అక్రమ అరెస్టులు ఆపాలి

మంచాల: అక్రమ అరెస్టులను నిలిపి వేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ పోచమోని కృష్ణ అన్నారు. మీర్‌ఖాన్‌పేట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి కార్యక్రమం ఉండడంతో మంచాల మండలంలోని పలు గ్రామాల్లో ప్రతి పక్ష నాయకులను ముందస్తు అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు చేసిన వారిలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బహదూర్, నోముల, మంచాల మాజీ సర్పంచ్‌లు బాలరాజ్, జగన్‌రెడ్డి, యువజన సంఘాల నాయకులు మహేష్, సంజయ్ ఉన్నారు.

యాచారంలో

యాచారం: సీఎం రేవంత్‌రెడ్డి కందుకూర్ మండల పర్యటన నేపథ్యంలో యాచారం పోలీసులు ప్రతి పక్ష నేతలను ముందస్తు అరెస్టులు చేశారు. యాచారం, నల్లవెల్లి, నక్కర్తమేడిపల్లి తదితర గ్రామాల్లో ఉన్న సీపీఎం, బీఆర్ఎస్ శ్రేణులను అరెస్టులు చేసి యాచారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



మంచాల: ఠాణా ఎదుట పోలీసుల అదుపులో ఉన్న నాయకులు



యాచారం: పోలీస్‌స్టేషన్ ఎదుట సీపీఎం, బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ నాయకుల ఆందోళన

మాడ్గుల: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఎమ్మెల్యేలు సబితారెడ్డి, సునీతారెడ్డిలపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం నాయకులు నిరసన చేపట్టారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. శాంతియుతంగా నిరసన చేపడుతున్న బీఆర్ఎస్ నాయకులను సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా ముందస్తు అరెస్టులు చేయడం సిగ్గుచేటన్నారు. పోలీసుల తీరును ఖండిస్తూ మాడ్గుల పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి బీఆర్ఎస్ నాయకుల ఆందోళన చేపట్టారు.


ఠాణా ఎదుట బీఆర్ఎస్ నాయకుల బైఠాయింపు

కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జైపాల్‌నాయక్, లాలయ్యగౌడ్, శంకర్‌నాయక్, శ్రీను, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమూర్తి పోరాటం స్ఫూర్తిదాయకం

ఇబ్రహీంపట్నం: కామ్రేడ్ కాచం కృష్ణమూర్తి వర్ధంతిని పురస్కరించుకొని సీపీఎం నేతలు గురువారం ఇబ్రహీంపట్నంలోని పాషానరహరి స్మారక కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మధుసూధన్‌రెడ్డి, సామేల్, మండల కార్యదర్శి బుగ్గరాములు మాట్లాడుతూ.. కాచం కృష్ణమూర్తి తెలంగాణ సాయుధ పోరాటంలో ముఖ్యపాత్ర పోషించారని కొనియాడారు. ఇబ్రహీంపట్నం, రాచకొండ ప్రాంతాల్లోని పేదలకు భూములు పంపిణీ చేయాలని, కూలీ రేట్లు పెంచాలని, వెట్టి చాకిరి రద్దు చేయాలని దొరలకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు నిర్వహించారన్నారు.


కృష్ణమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

కార్యక్రమంలో నాయకులు ఎల్లేష్, అంజయ్య, జగన్, రామకృష్ణారెడ్డి, నర్సింహ, సత్తన్న, శంకర్, యాదగిరి, వంశీ, సమన్నా తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్యే మురుగు నీరు

- వ్యర్థాల ముంపులో కాలనీ
- ముక్కుపుటాలు అదరగొడుతున్న దుర్గంధం

హుడాకాంప్లెక్స్: అధికారుల పర్యవేక్షణ లోపించడంతో అక్రమార్కుల ఆగడాలకు అంతు లేకుండా పోయింది. నగరంలో అనేక ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్లు, నాలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. మ్యాన్‌హోళ్లపై బాత్‌రూమ్‌లు, ఇతర నిర్మాణాలు వెలసి మురుగునీటి కాల్వలను మట్టితో ముంచేశాయి. పూడికతీసే అవకాశం కూడా లేకపోవడంతో దారుల గుండా డ్రైనేజీ నీరు ఏరులై ప్రవహిస్తున్నాయి. మురుగునీటి నుంచి వెలువడే దుర్గంధంతో స్థానికుల ముక్కుపుటాలు అదురుతున్నాయి. ఇంట్లో నుంచి బయటికి రావాలంటేనే జనం రోతగా భావిస్తున్నారు.

మ్యాన్‌హోళ్ల ఆక్రమణతో..

సరూర్‌నగర్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్ కాలనీలో మురుగునీటి కాల్వలపై ఏళ్ల క్రితమే అక్రమ నిర్మాణాలు వెలిశాయి. కబ్జాదారులు వీటిపై పలు నిర్మాణాలు చేపట్టి నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేశారు. పైపుల్లో పేరుకుపోయిన మట్టి, ఇతర వ్యర్థాలను తీసే అవకాశం లేకుండా చేశారు. చాలా చోట్ల మ్యాన్‌హోళ్లు కనుమరుగవగా ఉన్నవి కూడా మురుగునీటితో ఉప్పొంగుతున్నాయి. ప్రధాన రహదారులపైకి ఈ నీరు వచ్చి చేరుతుండటంతో పాదచారులతో పాటు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నీటి నుంచి వెలువడే దుర్గంధాన్ని తట్టుకోలేక ముక్కు మూసుకుంటున్నారు. ఈగలు, దోమలు వ్యాప్తి చెంది డెంగీ, మలేరియా, డయేరియా వంటి సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు.


భగత్‌సింగ్‌నగర్‌లో రోడ్లపై పారుతున్న మురుగునీరు

అభివృద్ధి ఓర్వలేకే బీఆర్ఎస్ కుట్ర


సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు

పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్: రైతు రుణమాఫీ నుంచి అందరి దృష్టి మరల్చడానికి బీఆర్ఎస్ నాయకులు కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నారని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. ప్రజా ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ చేశారన్నారు. గురువారం మండల కేంద్రంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, పార్టీ శ్రేణులు, రైతులతో కలిసి సీఎం చిత్రపటానికి ఆయన క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. రైతులు కాంగ్రెస్ పక్షాన నిలుస్తున్నారనే అక్కసుతో ఎమ్మెల్యే సబితారెడ్డిని అనని మాటలు అన్నారని సీఎంను విమర్శించడం సిగ్గుచేటని మండిపడ్డారు. సబితారెడ్డి సీఎల్పీ నాయకుడిగా భట్టి విక్రమార్కకు వచ్చిన హోదాను దక్కకుండా చేసేందుకు బీఆర్ఎస్‌లో చేరింది నిజం కాదా అన్నారు. రైతు బిడ్డ అయిన సీఎం రేవంత్‌రెడ్డిని జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. అప్పటి సీఎం కేసీఆర్ మహిళలను అగౌరవ పరిచారని ఆవేదన వ్యక్తం చేసిన సబితమ్మ, నేడు అదే బీఆర్ఎస్‌లో చేరి కాంగ్రెస్ నేతలను అవమాన పరిచేలా మాట్లడటం ఆమె అవకాశవాద రాజకీయాలకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, లక్ష్మయ్య, రామకృష్ణ, రాంచందర్, వెంకటయ్య, జహంగీర్‌బాబా, సత్యంయాదవ్, క్యామశేఖర్, భిక్షపతి, శ్రీను, శంకర్, శ్రీను, రామ్, శ్రీశైలం, పాండు, రాజేశ్, భానుకిరణ్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

అప్పుడు నోరు మెదపలేదు

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పెండింగ్ బిల్లులపై ఏనాడు నోరు మెదపని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బిల్లులు గుర్తుకు వస్తున్నాయని పలువురు మాజీ సర్పంచ్‌లు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచ్‌లు రాము నాయక్, పోతుగంటి శంకర్, పాండునాయక్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులను చేపట్టామని వాటికి బిల్లులు రాకపోవడం ఆవేదనకు గురిచేసిందన్నారు. దీనిపై అప్పట్లో మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి మౌనం వహించారని ఆరోపించారు.

గ్రామాభివృద్ధిలో కార్యదర్శులు కీలకం


తలకొండపల్లి: సన్మాన కార్యక్రమంలో నేతలు


మాడ్గుల: పంచాయతీ కార్యదర్శికి సన్మానం


కడ్తాల్: కార్యదర్శిని సన్మానించిన గ్రామస్తులు

తలకొండపల్లి: గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర ఎంతో కీలకమని మాజీ సర్పంచ్ కాడమోని శ్రీశైలం అన్నారు. మండలంలోని దేవుని పడకల్ గ్రామంలో బదిలీపై వెళ్తున్న పంచాయతీ కార్యదర్శి జంగయ్యకు, నూతనంగా వచ్చిన కార్యదర్శి మురళీలకు గురువారం సన్మాన, స్వాగత కార్యక్రమాలు నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పూలు, శాలువాలతో జంగయ్య, మురళీలను సత్కరించారు. కార్యక్రమంలో కృష్ణయ్య, భిక్షపతి, శ్రీను, రమేశ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శికి ఘన సన్మానం

కడ్తాల్: మండలంలోని మక్తమాధారం గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజునాయక్ తలకొండపల్లి మండలం చెన్నారం గ్రామానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రాజునాయక్‌ను మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సులోచన, మాజీ ఎంపీటీసీ మంజుల, నాయకులు సాయిలు, చంద్రమౌళి, నర్సింహగౌడ్, నర్సింహ ముదిరాజ్, గణేశ్, యాదగిరి తదితరులు ఉన్నారు.

వీడ్కోలు సమావేశం

మాడ్గుల: మండలంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శి జంగయ్య బదిలీపై వెళ్లడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కార్యదర్శి వహీద్‌కు పూలమాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు రాములు, విష్ణు, పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని ఇమామ్‌గూడ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీకుమారి విద్యార్థులకు తన సొంత ఖర్చులతో ఏకరూప దుస్తులు పంపిణీ చేసి దాతృత్వాన్ని చాటుకుంది. ఆమె రోజు నగరంలోని సైదాబాద్ నుంచి ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేస్తుంది. ఉచిత బస్సు ప్రయాణంతో ఆమె రోజు ఖర్చుచేసే కిరాయి డబ్బులతో పాఠశాలల్లో ఉన్న 70 మంది విద్యార్థులకు దుస్తులను గురువారం అందజేశారు.

లయన్స్ క్లబ్ సేవలకు విశేష గుర్తింపు

క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ రాజగోపాల్‌రెడ్డి

ఆమనగల్లు: సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో లయన్స్ క్లబ్‌కు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని సంఘం జిల్లా మాజీ గవర్నర్ రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం గురువారం వెల్దండలోని సీకేఆర్ ఫంక్షన్‌హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమనగల్లు లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా పసుల లక్ష్మారెడ్డి, కార్యదర్శిగా మహేశ్, కోశాధికారిగా నర్సింహ, పీఆర్ఓగా పాషా, ఇతర కార్యవర్గ సభ్యులతో రాజగోపాల్‌రెడ్డి ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. లయన్స్‌క్లబ్‌లు లాభాపేక్ష లేకుండా నిస్వార్థంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా మాజీ గవర్నర్‌లు చెన్నకిషన్‌రెడ్డి, రమేశ్‌బాబు, నరేందర్ రెడ్డి, రఘు, మహేందర్‌కుమార్‌రెడ్డి, రీజియన్ చైర్మన్ శ్రీను, జోన్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, క్లబ్ ప్రతినిధులు గోవర్ధన్‌రెడ్డి, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, బాలకృష్ణ, రామచంద్రారెడ్డి, మోహన్‌రెడ్డి, సంపత్‌కుమార్, చంద్రశేఖర్, కరుణాకర్‌రెడ్డి, అంజయ్య, సునంద, భిక్షపతి, సత్యం, చంద్రకాంత్‌రెడ్డి, రవికుమార్, సురేందర్‌రెడ్డి, మాస్టర్ ఆఫ్ సెరమని డా.దామోదర్‌రెడ్డి, తరుణ్, వెంకట్‌రెడ్డి, ఓంకారం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా లక్ష్మారెడ్డికి బాధ్యతలు అప్పగిస్తున్న మాజీ గవర్నర్ రాజగోపాల్‌రెడ్డి

ఎమ్మార్పీఎస్ నేతల సంబురాలు


ఇబ్రహీంపట్నం: చౌరస్తాలో సంబురాలు చేసుకుంటున్న ఎమ్మార్పీఎస్ నేతలు


యాచారం: ప్రధానిమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు


తలకొండపల్లి: అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత సంఘం నాయకులు

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉపవర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు కట్టబెడుతూ సుప్రీంకోర్టు గురువారం చారిత్రక తీర్పు వెలువరించింది. దాదాపు 30 ఏళ్లుగా మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ చేస్తున్న పోరాటం విజయ తీరాలకు చేరింది. ఇన్నేళ్ల నిరీక్షణకు తెర పడిన సందర్భంగా ఎస్సీ ఉపకులాలు సంబురాలు చేసుకున్నారు. ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో ఎమ్మార్పీఎస్ శ్రేణులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు సుప్రీం తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ ప్రధాన కూడళ్లలో విజయోత్సవాలు నిర్వహించారు.

సుప్రీం తీర్పుతో 30 ఏళ్ల నిరీక్షణకు తెర

ఇబ్రహీంపట్నం: ఎస్సీ వర్గీకరణకు సానుకూలంగా సుప్రీం న్యాయస్థానం తీర్పునిచ్చిందని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో గురువారం ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో బాణసంచాలు కాలుస్తూ, స్వీట్లు పంచుతూ ఇబ్రహీంపట్నంలో సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు పాండు, మహేశ్, సతీష్, ఎం.మహేశ్, రఘుపతి, దయానంద్, ప్రవీణ్‌కుమార్, మల్లేశ్, రమేష్ పాల్గొన్నారు.

మోదీ కృషితోనే ఎస్సీ వర్గీకరణ

యాచారం: ప్రధాని నరేంద్రమోదీ కృషితోనే ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ సాధ్యమైందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్యయాదవ్ పేర్కొన్నారు. వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో మండల కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి స్థానిక బీజేపీ నేతలు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవీందర్, యాదగిరిరెడ్డి, జంగయ్యగౌడ్, విజయకుమార్, శాంతికుమార్, బీరప్ప, ఐలేష్, ఈశ్వర్, పత్తిరాజు, రమేష్, దయాకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మాల్ కేంద్రంలో

సుప్రీం తీర్పుతో మాల్ కేంద్రంలో ఎమ్మార్పీఎస్ శ్రేణులు సంబురాలు నిర్వహించారు. నాయకులు మంద లింగం, బోడ కృష్ణ, బోడ ముత్యాలు, రాములు తదితరులు మాల్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు.

సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం

తలకొండపల్లి: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని ఎమ్మార్పీఎస్, దళిత నాయకులు మండల కేంద్రంలో విజయోత్సవాలు నిర్వహించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పాలతో అభిషేకించారు. అనంతరం బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, జ్యోతయ్య, గిరి, రామచంద్రయ్య, సురేష్, యాదయ్య, శ్రీశైలం, రాజు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం బహిరంగ క్షమాపణ చెప్పాలి


అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ నాయకుల డిమాండ్

కడ్తాల్: రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని, బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి వాఖ్యలను ఖండిస్తూ గురువారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు రాస్తా రోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్ మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాల్లో మాజీ మంత్రి సబితారెడ్డిని అవమానపరిచేలా మాట్లాడటం సీఎంకు తగదన్నారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన సబితారెడ్డి రాష్ట్రంలో తొలి విద్యాశాఖ మంత్రిగా పనిచేశారని గుర్తు చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్ గుప్తా, నాయకులు పంతునాయక్, నర్సింహాగౌడ్, సేవ్యానాయక్, వెంకటేశ్, నర్సింహ, రాంచంద్రయ్య, భీమన్, జమీర్, కృష్ణ, శ్రీకాంత్, పాండు, మల్లేశ్, అంజి, చందర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.